క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఈ నెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వికలాంగుల కోసం ఓటు వేసేందుకు ర్యాంపులు ,టేబుల్, కుర్చీలను మొదలైన వసతులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, ఎండ తీవ్రంగా ఉన్నందునా.. ఉపాధి హామీ పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, స్వచ్ఛమైన తాగునీరు, కూలీల కోసం టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులను అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న, పోగ్రామింగ్ ఆఫీసర్

కథలాపూర్: ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురి కాకుండా ఉండాలని ప్రజలకు వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని వైద్యశాఖ జిల్లా పోగ్రామింగ్ ఆఫీసర్ ఎం.డీ సమియోద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆరోగ్య ఉపకేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజారోగ్యం వివరాలు సేకరించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు సింధూజ, రజిత, సూపర్‌వైజర్ భూషణ్ ఉన్నారు.

ప్రతీ కూలీకి పని కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న సీఈవో రఘువరన్

పెగడపల్లి: గ్రామ పంచాయతీలో జాబ్‌కార్డున్న ప్రతి కూలీకి పని కల్పించే అధికారులదేనని జెడ్పీ సీఈవో రఘువరన్ ఆదేశించారు. మండలంలోని సుద్దపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు ఏర్పాటు చేసిన సదుపాయాలు పరిశీలించి, పనికి తగ్గట్టుగా కూలీ గిట్టుబాటు అవుతుందా లేదాని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, క్షేత్రస్థాయి సిబ్బందితో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఈసీ రమాపతి, ఏపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శి నదీం పాల్గొన్నారు.

అదుపుతప్పి వ్యాన్ బోల్తా

మేడిపల్లి: దమ్మన్నపేట ప్యాక్స్ సెంటర్‌లో వడ్ల లోడుతో రైస్‌మిల్లుకు వెళ్తున్న వ్యాన్ భీమారం మండలంలోని రంగాపూర్ వరద కాలువ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయలు కాగా, 500 వరకు వడ్లబస్తాలు కూలిపోవడంతో మళ్లీ వేరే లారీ తెప్పించి లోడ్‌వేసి మిల్లుకు పంపారు.

ముఖ్యమంత్రికి స్వాగతం


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ఎన్నికల ప్రచార నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా కోరుట్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కోరుట్లలో జరిగిన సభకు జగిత్యాల నియోజకవర్గం నుంచి బస్సులు, కార్లలో అత్యధికంగా ప్రజలు తరలివెళ్లి సభలో పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు


ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో జెండావిష్కరణ


మల్యాల మండల కేంద్రంలో..


ధర్మపురిలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు


కోరుట్ల మండలం పైడిమడుగులో కార్మికుల నాయకుల జెండావిష్కరణ


పెగడపల్లి మండలంలో..


జిల్లా కేంద్రంలో నినాదాలు చేస్తున్న విద్యుత్ శాఖ కార్మికులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్మిక సంఘం కార్యాలయం వద్ద టిఎస్ యూఈఈయూ(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రటి జెండాను ఎగురవేసారు. కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షుడు ఆంజనేయులు, జగిత్యాల సర్కిల్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, జగిత్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొమురయ్య, శేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో కార్మిక దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య తెలుగు నాడు బీడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ, మండలంలోని పైడిమడుగులో ఐఎఫ్‌టీయూ, అన్ని కార్మిక సంఘాలు, హమాలీ సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల అడ్డాలో అరుణ పతాకాలు ఎగురవేసి కార్మిక దినోత్సవాలు జరుపుకున్నారు.కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు సీతక్క, సుతారి రాములు, సత్యార్థ ప్రకాష్, భాలె గంగాధర్, ఎన్నం రాధ, వంశీ కృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి:మండలంలో బుధవారం మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పెగడపల్లి, కీచులాటపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు జెండాలు ఎగుర వేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భూమేశ్వర్, మాజీ సర్పంచి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల మండలంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో జెండా ఎగురవేశారు. కార్మికుల హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొక్కుల శాంతమ్మ, లలిత, జయశ్రీ,విజయ, పద్మ,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని గొధూర్ గ్రామంలో బుధవారం ఘనంగా మే డే వేడుకలను నిర్వహించారు. కళావేదిక వద్ద ఎర్ర జెండాను మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి, సిని నటులు మాజీ సర్పంచ్ గొదూర్ మురళి ఆవిష్కరించారు.

ధర్మపురి : ధర్మపురి పట్టణంలో మేడే సందర్భంగా బుధవారం కార్మికుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద కార్మికుల అధ్యక్షుడు బత్తిని రాజయ్య ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్మికులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు మేడే సందర్భంగా కార్మిక జెండా ఆవిష్కరించారు.


బీర్‌పూర్‌లో కార్మికుల మేడే సంబరాలు

మెట్‌పల్లి: పట్టణంలో కార్మిక దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీలు జెండాను ఎగురవేశారు.

అన్న ఒక చాయ్ ఇవ్వు..


టీ కొట్టు వద్ద చాయ్ తాగుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. అలసిపోవడంతో ఓ టీ కొట్టు వద్ద ఆగి టీ తాగారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కూసరి అనిల్, నాయకులు ఉన్నారు.

అమ్మా..కారును మరవొద్దు


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: అమ్మా.. కారును మరిచిపోవద్దని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్డులో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు పింఛన్లు, బతుకమ్మ చీరలు, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్లు ఇచ్చి ఆదుకున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏలాంటి హామీలు నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు అన్నం అనిల్, ఫయాం, కౌన్సిలర్ గంధం గంగాధర్, నగేష్, రహీంపాషా, గెల్లె గంగాధర్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, గొల్లపల్లె, గొర్రెగుండం, పోతారం, రాజారం, రాంపూర్,ఒబులాపూర్ గ్రామాల్లో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్ రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాలని పిలుపునిచ్చారు. అన్నదమ్ముల్లాగా కలిసి ఉన్న కులాలు, మతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతోందని, ప్రజలు గమనించాలని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గ్రంథాలయ మాజీ చైర్మన్


కాంగ్రెస్‌లో చేరుతున్న చంద్రశేఖర్‌గౌడ్

జగిత్యాలటౌన్: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జిల్లా గౌడ సంఘాల నాయకుడు, బీఆర్ఎస్ నేత డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల నాయకుడిగా, వైద్యుడిగా ప్రజల్లో మంచి పేరున్న చంద్రశేఖర్‌గౌడ్ పార్టీలో చేరడం శుభపరిణామన్నారు. జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానని చంద్రశేఖర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ వెల్ముల పుష్పలత, సీడీసీ మాజీ చైర్మన్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సుగుణాకర్ రావు, జాగృతి మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు బుధవారం కోరుట్లలో నిర్వహించిన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు జీవన్‌రెడ్డికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిడిగె పురుషోత్తం, కొత్త మోహన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

పెగడపల్లి:రాష్ట్రంతో పాటు కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలు ఆలోచించి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని నాయకులు కోరారు. పెగడపల్లి మండలంలోని దీకొండలో బుధవారం పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా స్థానిక నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మెన్ శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సతీశ్‌రెడ్డి, రవి నాయక్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

కథలాపూర్: విద్యార్థులను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి రాజేశ్ కోరారు.మండలంలోని పోసానిపేటలో బుధవారం బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలోని పలు వాడల్లో తిరిగి విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న వసతులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, నోడల్ ఆఫీసర్ లోకిని శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, స్థానిక హెచ్ఎం రవికుమార్, వేణుగోపాల్, సీఆర్పీలు గణేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

మెట్‌పల్లి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించేలా చూడాలని బుధవారం పట్టణానికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్రతో పాటు పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. బకాయిల చెల్లింపుల్లో జాప్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించగా, దీనిని సీఎం దృష్టికి తీసుకపోతానని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రతి కూలీకి ఉపాధిహామీ పని

జగిత్యాలరూరల్: ప్రతి కూలీకి ఉపాధిహామీ పని కల్పిస్తామని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, ఒడ్డెరకాలనీలో ఉపాధిహామీ పని ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధిహామీ పని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీలతోనే ఢిల్లీలో తెలంగాణ గళం

కథలాపూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే ఢిల్లీలో తెలంగాణ గళం వినిపిస్తుందని, ప్రజలు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి కోరారు. మండలంలోని అంబారిపేటలో బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. పలు కులసంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు అండగా ఉండాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంగరాజం, నాయకులు విద్యాసాగర్‌రావు, నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, కరిపె సత్యం, శ్రీరాముల ప్రకాశ్, తిరుమలేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలి

ధర్మపురి: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనులను చూసి ఓటేయ్యాలని ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ అన్నారు. మండలంలోని జైనా, కోసున్నార్‌పల్లె గ్రామాల్లో బుధవారం పెద్దపెల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ పెద్దఎత్తున నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో, ఉపాధిహామీ కూలీల వద్ద ప్రచారాలు చేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా గ్రామాల్లో అభివృద్ధి చేసిన ఈశ్వర్‌ను ఎన్నడూ మరువొద్దని రానున్న పార్లమెంట్ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, నాయకులు సొల్లు భీమయ్య, మాజీ సర్పంచ్‌లు ఎన్నం లక్ష్మారెడ్డి, పులిశెట్టి మల్లేశం, సంగి శేఖర్, మొగిలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడుతున్న మండల నాయకులు

మేడిపల్లి: మండలానికి చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారు. మండల వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, దేశాయిపేట మాజీ సర్పంచ్ దొంతి వనిత, మాచాపూర్ మాజీ సర్పంచ్ బాలరాజు వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొన్నటిదాక బీఆర్ఎస్ పార్టీలో అన్ని తానై చూసుకున్న సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వంగ వెంకటేశం బీఆర్ఎస్ పార్టీని వీడారు. అలాగే మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొప్పెరా లింగారెడ్డి, కాచారం మాజీ సర్పంచ్ చిట్యాల సురేశ్ బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రెబ్బాస్ మల్లయ్య బీజేపీలో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. వారం రోజుల్లో కాంగ్రెస్,బీజేపీలోకి బీఆర్ఎస్ నాయకులు చేరనున్నట్లు మండలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

భూసార పరీక్షలతో నేలకు రక్షణ

ధర్మపురి: భూసార పరీక్షలతో నేలకెంతో రక్షణని అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయికుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని దొంతాపూర్‌లో బుధవారం పొలాస వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రైతులు పంట పొలాల్లో పురుగు మందులు స్ప్రేలు చేసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను చేసి చూపించారు. నేల సారం పెరుగడానికి సేంద్రియ ఎరువులు ఎలా ఉపయోగ పడుతాయో అందులో వరి కంపోస్టు తయారీ విధానం, వానపాముల పెంపకం పోషకాలు, లాభాలు గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంపత్, సౌజన్య, ఎల్లాగౌడ్, రత్నాకర్, ప్రజ్ఞా, విద్యార్థులు, రైతులు తదితరులున్నారు.

లక్ష్మీపూర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గౌడ కులస్తులు రూ. 50 లక్షలతో రేణుకా ఎల్లమ్మ ఆలయం నిర్మిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నిర్మాణ పనులను గౌడ కులస్తులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి గర్వంద తిరుపతి గౌడ్, గర్వం నరేశ్ గౌడ్‌లతో పాటు దుబాయ్ గౌడ సంఘం సభ్యులు రూ.25 లక్షల వరకు విరాళాలు అందజేస్తున్నారు. వీరితో పాటు లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ గర్వంద గంగయ్య, గౌడ సంఘం నాయకులు గర్వంద సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. ఏడాదిలోగా ఆలయ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

సారంగాపూర్ ఎంపీడీవోగా లచ్చాలు

సారంగాపూర్: మండల ఎంపీడీవో లచ్చాలును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్వర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఎంపీడీవోగా పనిచేసిన వెంకటేశం పదవి విరమణ పొందడంతో ఆయన స్థానంలో బీర్‌పూర్ ఎంపీడీవో లచ్చాలుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా మురళి

మల్లాపూర్: పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొరుమంతుల మురళి, ఉపాధ్యక్షుడిగా సరుగుల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఈర రంజీత్, కోశాధికారిగా నోముల నారాయణరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శులు భూమేశ్వర్, నరేశ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు బీజేపీకే సాధ్యం


రామభద్రునిపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

పెగడపల్లి: సంక్షేమ పథకాలు అమలు మోదీతోనే సాధ్యమని లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని బలపరచాలని నాయకులు కోరారు. మండలంలోని రామభద్రునిపల్లిలో బుధవారం పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి కమలం పువ్వుగుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించి ఇంటింటా ప్రచార పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు మోహన్‌రెడ్డి, బాబు, పరశరామ్, శ్రీనివాస్, అంజన్న, రాజేశ్, బీమన్న పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ధర్మపురి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లికొండ అనిల్ అన్నారు. మండలంలోని వెల్గొండలో బుధవారం పెద్దపెల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాల శ్రీనివాస్‌కు మద్దతుగా గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఉపాధి కూలీల వద్దకెళ్లి బీజేపీకి ఓటేయాలని కోరారు. ప్కార్యక్రమంలో పోషరాజు, అక్కల రాజుకుమార్, నరేష్, తిరుపతి తదితరులున్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మల్లారెడ్డి

రాయికల్: కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాయికల్ మండల కేంద్రానికి చెందిన కుర్మ మల్లారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేయగా, బుధవారం జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు మల్లారెడ్డికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, బోడుగం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 12 మంది బుధవారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరినవారికి కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించినట్లు బీజేపీ నాయకులు పిడుగు ఆనంద్‌రెడ్డి, సురేశ్, స్వామి తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2004-05లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనాటి మధురమైన జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.